క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: బాల్య వివాహాలు వద్దు.. ఆడపిల్లలను చదివిద్దాం అంటూ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాలకు చెందిన మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఆడ పిల్లలను చదివిద్దామని, వారిని చిన్నచూపుగా చూడవద్దంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, అధ్యాపకురాలు పద్మజ పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించండి


కవిటి ఎస్ఐ రవివర్మను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కవిటి: ప్రజలందరికీ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మెరుగైన రక్షణ చర్యలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కవిటి ఎస్ఐ వి.రవివర్మను కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్సైని కలిసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఎస్సైని కలిసిన వారిలో బెందాళం జయప్రకాష్, పి.నీలాచలం, జల్లు యుగంధర్, దేవరాజ్ సాహూ, పి.శేఖర్, శివ బిసాయి, దువ్వు కృష్ణారెడ్డి, బదకల భాస్కరరావు, జల్లు నరేష్, యలమంచి సత్యం ఉన్నారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న ఎస్సై నారాయణస్వామి

సంతబొమ్మాళి: నిషేధిత పదార్థాలు విక్రయించిన, వాడిన కఠిన చర్యలు తప్పవని నౌపడ ఎస్సై జి.నారాయణస్వామి హెచ్చరించారు. నౌపడ బస్టాండ్ ఆవరణలోని పలు షాపుల్లో డాగ్‌స్క్వాడ్ సహాయంతో మాదకద్రవ్యాలను గుర్తించేందుకు సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు చేపట్టారు.

ఎస్ఐను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎస్సైను అభినందిస్తున్న నాయకులు

సోంపేట: సోంపేట ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన లవరాజును వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎస్సైను కలిసిన వారిలో పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, జింకిభద్ర ఉపసర్పంచ్ సాహుకారి జానీ, తామాడ సూర్యనారాయణ, సూరాడ పాపారావు ఉన్నారు.

ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు


భగీరథిదొళాయి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: ప్రభుత్వ ఉద్యోగికి విధినిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బొరివంకలో బెంతొ ఒరియా సంఘం ప్రతినిధులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పీఆర్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన భగీరథిదొళాయి దంపతులను గ్రామస్తులు బుధవారం సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.శ్రీరాంప్రసాద్, దేవరాజ్‌సాహు, ఇప్పిలి కృష్ణారావు, దుద్ది సతీష్, గెస్ట్ సంస్థ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు ఉన్నారు.

ఘనంగా చండీయాగం


తనయుడుతో కలిసి అగ్నిగుండాన్ని తొక్కుతున్న భవానీస్వామి

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 17వవార్డు రోటరీనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో గురుభవానీ రాజు ఆధ్వర్యంలో చడీయాగాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షలు చేపట్టిన భవానీ, అయ్యప్పస్వామిలు, సాధారణ భక్తులు అగ్నిప్రవేశం చేశారు. అగ్నిగుండాన్ని తొక్కి భక్తిని చాటుకున్నారు. స్థానికులు భారీగా వచ్చి అగ్నిగుండా ప్రవేశాన్ని తిలకించారు.


నిలిచిపోయిన ట్రాఫిక్

- పలాస పట్టణంలో నిత్యం ట్రాఫిక్ జాం
- ఇందిరాచౌక్ టూ మొగిలిపాడుకు డబుల్‌లైన్ రోడ్డు అవసరం


ఇందిరాచౌక్-మొగిలిపాడు మధ్య విస్తరణ జరపాల్సిన రోడ్డు

గజిబిజి ప్రయాణం!


ఇరుకుగా ఉన్న మొగిలిపాడు రోడ్డు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పేరుకే గ్రేడ్-2 మున్సిపాలిటీ. ఇక్కడ రోడ్లన్నీ ఇరుకైన సందులు, రాకపోకలకు ఇబ్బందిగా చిన్న రోడ్లే. దీంతో జనానికి గజిబిజి ప్రయాణం తప్పడం లేదు. నిత్యం ఎక్కడో ఒకదగ్గర వాహనాలు స్తంభించడం పరిపాటిగా మారింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణ పనులు నాలుగు కోట్ల రూపాయలతో జరిపించడంతో కొంతవరకూ ప్రజలకు కష్టాలు తప్పాయి. పలాస ఇందిరా చౌక్ నుంచి జాతీయ రహదారిని కలిపే ఒకటోవార్డు మొగిలిపాడు రోడ్డు విస్తరణపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

నిత్యం అవస్థలే..

మున్సిపాలిటీ పరిధిలో ప్రధానమైన కేటీ రోడ్డు విస్తరణ పనులు చేయాలని స్థానికంగా డిమాండ్ ఉంది. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు, కాశీబుగ్గ బస్టాండ్‌కు వచ్చే బస్సులు ఇటీవల పలాస మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. అంతేకాకుండా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన వాహనదారులు కాశీబుగ్గ రైల్వేగేటు వేస్తే ఇబ్బందిగా ఉంటుందనే ఉద్దేశంతో పలాస రోడ్డు మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటారు. దీంతో పాటు వందలాదిగా ఉన్న జీడి పరిశ్రమలకు పప్పు, పిక్కల రవాణా వాహనాలు నిత్యం ఇదే రోడ్డులో రాకపోకలు జరుపుతున్నాయి. ఆంధ్రా నుంచి ఒడిశా చేరుకోవాలన్నా, పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్, పశువైద్య సహాయ సంచాలకుల కార్యాలయాలు, జూనియర్ సివిల్ కోర్టు, తపాలా కార్యాలయం, వివిధ వసతిగృహాలు, ప్రభుత్వ హైస్కూళ్లకు వెళ్లి వచ్చే వాహనదారులందరికీ ఇదే మార్గం సులువు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఇదే రోడ్డులో విస్తరణ పనులు జరిగితే అనేక దుకాణాలు, ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలనే ఉద్దేశంతో ప్రతిసారి నాయకులు విస్తరణ పనులు చేయడానికి ముందుకు రావడం లేదనే ప్రచారం ఉంది. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు



మా పిల్లలు చదువు నిమిత్తం కాశీబుగ్గకు చేరుకోవడానికి పలాస మీదుగా రావాల్సి వస్తుంది. అయితే ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో ఇబ్బందిగా ఉంటుంది. ఇది పంచాయతీరాజ్ వారి ఆధీనంలో ఉన్న రూరల్ రోడ్డు. తక్షణమే అధికారులు విస్తరణ పనులు చేయాలని కోరుకుంటున్నాం.

– చింతాడ మాధవరావు, సున్నాద, పలాస మండలం

రోడ్లను విస్తరించాలి



మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డు కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్ నిత్యం పలాస-కాశీబుగ్గ రోడ్లపై రాకపోకలు జరుపుతుంటారు. అందరూ కలిసి మున్సిపల్ సమావేశంలో పలాస రోడ్డు అంశం ప్రస్తావించి అటు మున్సిపాలిటీ, ఇటు పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో కొలిక్కి తీసుకురావాలి. అప్పుడే రోడ్డు విస్తరణ అనేది జరుగుతుంది. అధికారులు, పోలీసు అధికారులు ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. నాయకులు ముందుకొచ్చి విస్తరణ పనులు చేపట్టాలి. ఇది అందరి సమస్యగా గుర్తించాలి.

– వల్లభ వైకుంఠరావు, రెండో వార్డు, నెమలినారాయణపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

పొగురుతీత పనులు ప్రారంభం

కవిటి: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పుటియాదళ, కపాసుకుద్ది రెవెన్యూ గ్రామాల పంట పొలాల్లో వరద నీరు చేరింది. దీన్ని తొలగించేందుకు రైతులు పూనుకున్నారు. రంగాల గెడ్డలో వరదనీటిని సముద్రంలో కలిసేందుకు అవసరమైన పొగురుతీసే పనులను బుధవారం ప్రారంభించారు. తామే నిధులను సమకూర్చుకొని పొగురు తీత పనులు చేపడుతున్నామని పుటియాదళ, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ, కవిటి, గొండ్యాలపుట్టుగ, పుక్కళ్లపాలెం గ్రామాల రైతులు చెప్పారు. తొలగించకుంటే పంటపొలాల్లో వరదనీరు బయటకు వెళ్లే అవకాశం లేక వరిపైరు పాడయ్యే ప్రమాదం ఉంది. దీంతో జేసీబీతో బుధవారం మధ్యాహ్నం నుంచి ఈ పొగురుతీసే పనులు జరుగుతున్నాయి. గురువారం మధ్యాహ్నానికి నీరు సముద్రంలో కలిసేందుకు అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


పుక్కళ్లపాలెం సముద్రతీరంలో జేసీబీతో పొగురుతీసే పనులు చేపడుతున్న దృశ్యం

విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రారంభం

ఇచ్ఛాపురం: విశాలాంధ్ర సంచార పుస్తకాలయంతో ఎంతో విజ్ఞానం సంపాదించవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. పట్టణంలోని సంచార పుస్తక విక్రయ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. స్థానిక న్యాయవాది నాగరాజుపాత్రో, విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్ సిబ్బంది పాల్గొన్నారు.


బుక్‌హౌస్‌ని ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు


కంచిలి: ఖోఖో విజేతగా నిలిచిన జేఎంజే పాఠశాల జట్టును అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు


ఇచ్ఛాపురం: కబడ్డీ జోనల్‌స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో తదితరులు

కంచిలి: మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు పెద్దశ్రీరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను సీనియర్ బాలురు, బాలికలకు నిర్వహించారు. ఖోఖో పోటీల్లో బాలికల విభాగంలో విజేతగా కంచిలి జేఎంజే హైస్కూల్, రన్నర్‌గా మకరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలుర ఖోఖో విజేతగా నువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాల, రన్నర్‌గా కంచిలి జేఎంజే హైస్కూల్, కబడ్డీ బాలికల విభాగంలో జలంత్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాల, రన్నర్‌గా జేఎంజే హైస్కూల్, బాలుర విభాగం కబడ్డీలో విజేతగా గోకర్ణపురం జెడ్పీహైస్కూల్, రన్నర్‌గా మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్, వాలీబాల్ బాలుర విభాగంలో విన్నర్‌గా పెద్దశ్రీరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, రన్నర్‌గా కంచిలి జేఎంజే హైస్కూల్, వాలీబాల్ బాలికల విభాగంలో జలంత్రకోట జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా పెద్దశ్రీరాంపురం జేఎంజెడ్పీ హైస్కూల్ విజేతగా నిలిచాయి. ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: క్రీడలతో ఉజ్వలభవిష్యత్ సాధ్యమని కె.అప్పారావు అన్నారు. పట్టణంలోని శ్రీసురంగిరాజా క్రీడామైదానం ఆవరణలో మండలస్థాయి గ్రిగ్స్‌పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్-14 బాలురు విభాగంలో వాలీబాల్, టెన్నీకాయిట్, కబడ్డీ, బాలికల విభాగంలో ఖోఖో, టెన్నికాయిట్ పోటీలను..అలాగే అండర్-17 బాలురు విభాగంలో కబడ్డీ, బాలికల విభాగంలో టెన్నికాయిట్, ఖోఖో పోటీలను నిర్వహించారు. జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మశ్రీ, శ్రీనివాస్‌పూండి, సాజన్, వజీర్, దర్మరాజు, ఊర్మిల, గణేష్, రవి, సుదాకర్, శ్రీనివాస్, మోహన్, సూర్య, యాదవ్ పాల్గొన్నారు.


పాతటెక్కలి పాఠశాలలో పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈవో దాశరథి

విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్షలు

వజ్రపుకొత్తూరు: విద్యార్థుల్లో నిక్షిప్తమైన సామర్థ్యాలు, నైపుణ్యాలు, ప్రగతిని వెలికి తీసేందుకు విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో డి.డి.దాశరధి తెలిపారు. పాతటెక్కలి, నగరంపల్లితో పాటు మరో నాలుగు పాఠశాలల్లో ఎన్ఏఎస్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. వమరవెల్లి డైట్ కళాశాల నుంచి 12 మంది విద్యార్థులు వచ్చి ఇప్పటి వరకు పూర్తయిన పాఠ్యాంశాల సిలబస్‌పై పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కార్యక్రమమని, వీటి ఫలితాలను విద్యాశాఖకు పంపిస్తామన్నారు. ఎంఈవో-2 డి.వి.రమణ, సీఆర్‌పీలు ఎ.క్రిష్ణారావు, జి.శ్రీనివాసరావు, భారతి పాల్గొన్నారు.

10న గణిత ఎగ్జిబిషన్ మేళా

ఇచ్ఛాపురం రూరల్: మండల స్థాయి గణిత ఎగ్జిబిషన్ మేళాను ఈనెల పదో తేదీ నిర్వహిస్తున్నట్టు ఎంఈవో కురమాన అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవంగా ఈ నెల 19వ తేదీన మేళా నిర్వహించాల్సి ఉండగా.. అదే రోజున ఎస్ఏ-1 పరీక్ష ఉన్న కారణంగా ముందుకు మార్చడం జరిగిందన్నారు. బిర్లంగి తోటూరు, పట్టణం పంజావీధి పాఠశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని పంజావీధి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. మూడు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని అయోధ్యపురం గ్రామంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో భాగం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలుగు అనర్థాలను వివరించారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పలాస: జీడి మామిడి పంటలకు తక్షణమే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పలాస ఉద్యానవన అధికారి శంకర్‌దాస్ చెప్పారు. బొడ్డపాడు గ్రామ సచివాలయం ప్రాంగణంలో బుధవారం ఉద్యాన వన పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా జీడి, మామిడి, కొబ్బరి, పనస, మునగ తదితర పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగుబడి విధానాన్ని వివరించారు. వ్యవసాయ సహాయకురాలు తెప్పల పావని, ఈవో పోలారావు, రైతు నాయకులు కిక్కర డిల్లీరావు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో టెక్కలి డివిజన్ పాస్టర్లు

కాశీబుగ్గ:

మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడం క్రిస్టియన్ ప్రెయర్ టెంపుల్‌లో టెక్కలి డివిజన్ పాస్టర్ కుటుంబ సభ్యుల క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా రాజమండ్రికి చెందిన ప్రశాంత్‌కుమార్ దంపతులు హాజరై క్రిస్మస్ కేక్‌కట్ చేశారు. క్రీస్తు సందేశాన్ని వినిపించారు. బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్, పాస్టర్లు జాన్ డేవిడ్, జాయ్ ప్రసాద్, వైఎస్ యేలియా, దానియేలు, ప్రభుదాస్, సుందర్‌రావు, ఇశ్రాయేలు, యేసుబాబు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం..



పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన బడ్డి సంతోష్‌కుమార్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాడు. కడప జట్టులో పాల్గొని రాష్ట స్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో అతనిని బుధవారం సత్కరించి గౌరవించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన జెస్సీ కబడ్డీ ఈవెంట్స్ అధినేత కిక్కర డిల్లీరావు, క్రీడాకారులు గర్తం తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

– పలాస

అద్భుతాలు సృష్టించాలి



విద్యార్థులు వినూత్నమైన ఆలోచనతో అద్భుతాలు సృష్టించాలని జేఎన్‌టీయూ జీవీ అకడమిక్ డైరెక్టర్ ఆర్.రాజేశ్వరరావు సూచించారు. ఇన్నోవేటివ్ ప్రొడెక్ట్ డిజైన్ అండ్ ఇంటెలిజెంట్ మేనిఫాక్చరింగ్ సిస్టమ్స్ అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఐటీ రూర్కెలా సౌజన్యంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును బుధవారం ప్రారంభించారు. మానవ మేధస్సును రిజిస్ట్రేషన్ చేయడంలో భారత్ వెనుకంజలో ఉందన్నారు. కేవలం ఉద్యోగం, ప్రమోషన్ కోసమే జర్నల్స్ ప్రచురితం చేస్తున్నారని రాజేశ్వరరావు గుర్తు చేశారు. ఈ సందర్భంగా పుస్తకాలను ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీఎస్ఈ హెచ్ఓడీ వై.రమేష్, సదస్సు కోఆర్డినేటర్ ఎం.జయంతిరావు పాల్గొన్నారు.

– టెక్కలి

జాగ్రత్తలు తప్పనిసరి



ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు అన్నారు. ఇచ్ఛాపురం ఎంపీడీవో సమావేశ మందిరంలో వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లు, రైస్ మిల్లర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ధాన్యాన్ని వాహనంలో ఎగుమతి చేసిన దగ్గర నుంచి రైస్‌మిల్లు వద్ద దిగుమతి అయ్యే వరకు జీపీఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయడం జరుగుతుందన్నారు. రైతులు గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ మొత్తాన్ని నేరుగా ధాన్యం సొమ్ముతో కలిపి రైతు ఖాతాకు జమ చేస్తామన్నారు. పౌర సరఫరాల అధికారి కె.సంతోష్, మండల వ్యవసాయాధికారి టి.భార్గవి, పీఏసీఎస్ సీఈవో భుజంగరావు ఉన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

చెడుబాట పట్టొద్దు..



యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ డీఎస్పీ ఎం.వెంకట అప్పారావు అన్నారు. పూండిలోని సాయివినీత్ విద్యా సంస్థలో సంకల్పం కార్యక్రమాన్ని ఆ విద్యా సంస్థల అధినేత డాక్టర్ కె.లీల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. డ్రగ్స్‌కి అవాటు పడి జీవితాలు బుగ్గిపాలు చేసుకోవద్దని అవగాహన కల్పించారు. చెడు స్నేహాలు, ర్యాగింగ్‌లకు పాల్పడి అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరస్తుల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను పిల్లలు నెరవేర్చాలన్నారు. ఎస్ఐ బి.నిహార్, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాశరావు, అధ్యాపకులు జి.సాయిగోపాల్, బత్తిన శ్రీనివాసరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.

– కాశీబుగ్గ

జీపీఎస్ యంత్రాలకు చెల్లింపులపై ఆందోళన!

కంచిలి: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం ద్వారా గుర్తించిన వాహనాలకు జీపీఎస్ యంత్రాలు ఏర్పాటుకు రూ.3,200 వసూలు చేయడంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరకు ఈ యంత్రాలను ప్రభుత్వమే అమర్చి, కేవలం రీచార్జి చేయడానికి మాత్రం వంద రూపాయలను మాత్రమే వసూలు చేసేవారు. ఈ ఏడాది మాత్రం కొత్త వాహనాలకు యంత్రాలు అమర్చితే రూ. 3,200 వసూలు చేస్తుండటంపై వాహనదారులు పెదవి విరుస్తున్నారు. మండలంలో గత ఏడాది 19 వాహనాలకు యంత్రాలు అమర్చి ధాన్యం సేకరణ చేశారు. ఈ ఏడాది ధాన్యం తరలించడానికి బుధవారం 12 వాహనాలకు జీపీఎస్ యంత్రాలు అమర్చడం, సాంకేతిక మరమ్మతులు, రీచార్జి చేయడం వంటి ప్రక్రియలు చేపట్టారు. ఈ ప్రక్రియను మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేశారు. అయితే జీపీఎస్ ఏర్పాటుకు వేలల్లో డబ్బుల వసూలు చేయడం తగదని వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

9 వరకు ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు అవకాశం

నందిగాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదుకు ఈ నెల తొమ్మిదో తేదీ వరకు సమయం ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో నమోదు చేసుకోని అర్హులైన ఉపాధ్యాయులు తప్పనిసరిగా చివరి తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ఆహ్వానం

కంచిలి: విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఈ నెల ఏడో తేదీన అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోస్టర్లను, ఆహ్వాన పత్రికలను సిద్ధం చేశారు. వాటిని బుధవారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం సీతారాంనాయుడు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. వీటితో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంచిలి: పోలేరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ తెలిపారు.

హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 వినతులు

కాశీబుగ్గ: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 వినతులు అందాయి. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వినతులు స్వీకరించారు. ఆర్‌కేపురం, బొడ్డపాడు-2 తర్లాకోట అర్బన్ లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు, టిడ్కో ఇళ్ల కేటాయింపులకు సంబంధించి పలువురు వినతులు అందించారు.

అసంబద్ధత నిర్ణయాలు రద్దు చేయాలి

టెక్కలి: విద్యా శాఖలో అసంబద్ధత నిర్ణయాలు రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈవోలు బి.తులసీరెడ్డి, బి.చిన్నారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలల పనివేళలు పెంపు, 10 శాతం మించి సెలవులు తీసుకోకూడదనే ఆంక్షలు, పదో తరగతి విద్యార్థులకు సంసిద్ధత పేరుతో యాక్షన్ ప్లాన్ తదితర నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, ఎం.కుమారస్వామి, ఎస్.కృష్ణారావు, శ్రీనివాసరావు, చిన్నవాడు, బి.నారాయణరావు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లికి చెందిన కిడ్నీ బాధితులు, వృద్ధులకు అమ్మనాన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మరడ గృహలక్ష్మి దుప్పట్లు, చీరలు బుధవారం పంపిణీ చేశారు. డయాలసిస్ చేసుకుంటున్న రాముకి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు.

రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలిస్తాం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపైకి పశువులను విడిచిపెడితే వాటిని పట్టుకొని గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రోడ్లపై పశువులు తిరుగుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వీటి కారణంగా ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురౌవుతున్నారన్నారు. పశువుల యజమానులు ఈ విషయాన్ని గమనించి రోడ్లపైకి విడిచి పెట్టవద్దని సూచించారు.

మల్లన్నకు సంప్రోక్షణ పూజలు


సంప్రోక్షణ పూజల్లో ఆర్డీవో కృష్ణమూర్తి తదితరులు

టెక్కలి: కార్తీకమాసం ముగింపు సందర్భంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి సన్నిధిలో బుధవారం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఈవో గురునాథరావు పర్యవేక్షణలో అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి హాజరై మల్లన్నకు అభిషేకం చేశారు.